# పిల్లికథ

"మ్యా! మ్యా!"

"అమ్మోయ్, పిల్లికూనేవ్!" అన్నది చిట్టి.

"తెల్లగా ఎంత ముద్దొస్తోందో!" అన్నాడు బుల్లాడు.

"ఛీ, ఛీ! దాన్ని ముట్టుకుంటారేం మర్రా. పిల్లిని ముట్టుకుంటే పంచ మహాపాతకాలూ చుట్టుకుంటై." అన్నాడు నాన్న.

"మ్యా, మ్యా!" అన్నది కూన.

"చూడు నాన్నా, ఎట్లా దగ్గిర కొస్తుందో" అన్నాడు బుల్లాడు.

"ఇది పెంపుడుపిల్లి. అందుకే పారిపోవటంలేదు." అన్నది చిట్టి.

"చూడు నాచెయ్యి ఎట్లా నాకుతుందో," అన్నాడు బుల్లాడు.

"దాని కాకలవుతోంది," అన్నది చిట్టి.

"చెబితే మీకెక్కదుట్రా? దాన్ని వెళ్ళగొట్టండి ముందు... బొచ్చంతా రాలిపోయి ఎంత అసహ్యంగా ఉందో, దాన్ని ముట్టుకున్నారంటే మీక్కూడా చీడ పట్టుకుంటుంది" అన్నాడు నాన్న.

"దాని కాకలవుతుంది, నాన్న. కొంచెం అన్నంపెట్టి వెళ్ళగొడదాం" అన్నది చిట్టి.

"దానికి చీడలేదు, నాన్న" అన్నాడు బుల్లాడు. మజ్జిగా అన్నమూ కలిపిపెడితే కూన ఉత్సాహంగా తిన్నది.

అనుకున్న ప్రకారం కూన ఇల్లువదిలి పోలేదు. అది ఇల్లు తనసొంతం చేసుకున్నది. అందరితోపాటు ప్రతిపూటా తిండి కొచ్చేది. మిగతా సమయాల్లో ఎండపొడో, వెచ్చని చోటో చూసుకొని నిద్రపొయ్యేది. రాత్రిపూట ఎవరో ఒకరి ప్రక్కలో పడుకునేది. దానికి ఇష్టం వచ్చినప్పుడు బయటికివెళ్ళి పెత్తనాలు చేసి వచ్చేది.

నాన్నకు పిల్లిని చూస్తే చాలాకోపంగా ఉండేది. "ఏమిటీ వెధవ పిల్లి? పొద్దునే మనకు దీని దర్శనం! అస్తమానమూ ఏ పనిచేసుకోబోయినా అడ్డం వస్తూంటుంది... పిల్లలూ, మీరు దీన్ని మచ్చికచేస్తే ఊరుకోను. రెండుపూటలు తిండి వెయ్యకుండా ఉంటే అదేపోతుంది" అన్నాడు నాన్న.

"ఏం, నాన్నా, పాపం...! "అన్నది చిట్టి.

"పిల్లి పాపిష్టిది. ఇంకా కుక్క నయం విశ్వాసంగల జంతువు. దానికి స్వామిభక్తి ఉంది. పిల్లికి విశ్వాసంలేదు. తన సుఖమే చూసుకుంటుంది. ఇంకొకరి సుఖం ఓర్వలేదు. మనం ఏదన్నా తింటుంటే శాపనార్థాలు పెడుతుంది. పిల్లి శాపనార్థాలంటే అవే. మనం తినే ముద్దలుకూడా లెక్క పెడుతుంది" అన్నాడు నాన్న.

"పిల్లికి ఒంట్లు వచ్చా, నాన్నా!" అన్నాడు బుల్లాడు.

"దాని ఒంట్లు దానికొచ్చులే," అన్నాడు నాన్న చిరాకుగా.

"పిల్లికికూడా కృతజ్ఞత ఉంటుంది, నాన్నా. అది నాతోనూ బుల్లాడితోనూ ఆడుకుంటుందిగాని నీతో ఆడుకోదేం!" అన్నది చిట్టి.

"ఏమైనా దానికి అన్నంపెడితే నేను ఒప్పుకోను. మనుషులకే తినటానికి లేకుండా ఉంది!" అన్నాడు నాన్న.

"దాని తిండెంత, నాన్నా? మనం పారేసినంత ఉండదూ?" అన్నాడు బుల్లాడు.

"పిల్లేగు." అన్నాడు నాన్న.

* * *

"చూడండి. ఈ దిక్కుమాలిన పిల్లి ప్రద్దాన్లోనూ మూతి పెడుతున్నది! ఎట్లా చచ్చేది దీంతో!" అన్నది అమ్మ.

"గోతాంలో పెట్టి ఊరిబయట విడిచొస్తేగాని దీనిపీడ వదలదు."

"దాన్ని అన్నంపెట్టక చంపుతుంటే ఏం చేస్తుందే!" అన్నాడు బుల్లాడు.

"దాన్నెవరు మేపుతారు? దాని తిండి అది చూసుకోమను" అన్నాడు నాన్న.

"దాని తిండి ఏం చూసుకొంటుంది. ఇప్పుడింట్లో ఎలికెలుకూడా లేకుండా పోయిన్నై" అన్నాడు బుల్లాడు.

"అవును, పాపం. దాని ధర్మమా అంటూ ఈ పిల్లొచ్చాక ఎలికెల బాధలేదు." అన్నది అమ్మ.

"అది ఎలికెల్ని పట్టినా మనం దాని కన్నం పెట్టం" అన్నది చిట్టి.

"మనమే కృతజ్ఞత లేనివాళ్ళం" అన్నాడు బుల్లాడు.

"ఇంకేం ఎలికల్ని పట్టుకోమను ? మళ్ళీ అన్నంకూడా దేనికీ !" అన్నాడు నాన్న.

"ఎలికెలు అయిపోయినకొద్దీ మనకు లాభం. దానికి నష్టం. ఇదేం న్యాయం నాన్నా !" అన్నాడు బుల్లాడు.

"పట్టుకునేటందుకు ఎలికెలు లేకపోతే ఇంకా ఈ పీనిగె మన కొంపలో దేనికీ !" అన్నాడు నాన్న

"అక్కర తీరితే అల్లుడు లంజకొడుకు" అన్నాడు బుల్లాడు.

"అది ఇంట్లో ఉండగూడదర్రా వెధవ చీడపిల్లి ! దాన్ని ముట్టుకుంటేనే రోగాలొస్తాయి" అన్నాడు నాన్న.

"చీడపిల్లా నాన్నా ? చూడు దాని వొంటినిండా ఊలుబంతల్లే ఎంతబొచ్చో. బలిసి ఎంత ముద్దొస్తున్నదో!" అంది చిట్టి.

"మనింట్లో బాగా పాలూ, మజ్జిగా తిని కొవ్వింది. లావుగా ఉండదూ !" అన్నాడు నాన్న.

"చిక్కితే చిక్కిందంటావు. బలిస్తే బలిసిందంటావు, యెట్లా నాన్నా !" అన్నాడు బుల్లాడు.

"మనం మనుష్యులంకదా, పిల్లుల్ని దగ్గిర పడుకోబెట్టుకోవటమూ, దాన్ని ఎత్తుకుని ఆడుకోవటమూ అసహ్యం కాదుట్రా !" అన్నాడు నాన్న.

"అది మనకన్న శుభ్రంగా ఉంటుంది. రోజుకు పదిసార్లు ఒళ్ళంతా నాక్కుంటుంది. పక్కమీద ఉచ్చకూడా పొయ్యదు" అన్నది చిట్టి.

నాన్న మాట్లాడలేదు. కాని, మర్నాటినించీ పిల్లికూడా కనపళ్ళేదు. నాన్న ఏం చేశాడో మరి.

* * * *

క్రిస్మస్ శెలవులకి బావొచ్చాడు.

చిట్టి, బుల్లాడూ బావ చెరో చెయ్యీ పట్టుకు వేళ్ళాడుతూ పిల్లి కధంతా చెప్పారు,

"పిల్లిని వెళ్ళగొట్టటం అన్యాయమే" అన్నాడు బావ. "మచ్చిక చెయ్యని పిల్లి దాని యిష్టంవచ్చినట్లు అది జీవిస్తుంది. తిండి దొంగిలిస్తుంది. కొట్టబోతే పారిపోవటం నేర్చుకుంటుంది. దాని బతుకుఅది చూసుకుంటుంది. కాని మనం దాన్ని మచ్చిక చేసిన తరువాత దానిబతుకు అది

చూసుకోలేదు. ఎలికెలబాధకోసం పిల్లిని పెంచి ఎలికెలబాధ పోగానే దాన్ని వెళ్ళగొట్టేస్తే దానిగతి ఏంకానూ ? కొన్నాళ్ళు మనుషులు దానికి తిండి పెట్టటంచేత మనిషి తనకు శత్రువనేజ్ఞానం దానికి లేకుండాపోతుంది. దొంగతనంగా తిండి సంపాదించటం దానికలవాటుండదు. మనిషినినమ్ముతూ అది తిండిలేక చస్తుంది. ఆ పాపం పెంచినవాళ్ళని చుట్టుకుంటుంది" అన్నాడు బావ.

"ఇప్పుడు మళ్ళీ మనింటో ఎక్కడ చూసినా ఎలికెలే" అన్నదిచిట్టి.

"ఎందుకుండవూ ? పిల్లి ఉన్నంత కాలమూ దానిఉపయోగం ఏమీ లేనట్టే ఉంటుంది. అదిపోయిన తరువాతగాని దానిప్రయోజనం తెలియదు" అన్నాడు బావ.

"పిల్లులు మంచివికావంటాడే నాన్న ! వాటిని ముట్టుకుంటే పంచ మహా పాతకాలు చుట్టుకుంటాయట. వాటిని ముట్టుకుంటే రోగంకూడ వస్తుందట." అన్నాడు బుల్లాడు.

"దానిబతుకు దాన్ని బతకనివ్వక మనం దాన్ని సరిగా చూడనప్పుడు పిల్లి అనారోగ్యంగా ఉండదూ ? వొంటినిండా చీడపడుతుంది. బొచ్చంతా రాలిపోతుంది. మనం చూడకుండా అది మనంతినే వాటిని ముట్టుకోవచ్చు. మన పక్కల్లో పడుకోవచ్చు. మన గిన్నెల్లో మూతి పెట్టవచ్చు. అట్లా కూడా మనకు రోగాలొస్తాయి...అంతేగాని మనం శ్రద్ధగా పెంచేపిల్లి ఎంత ఆరోగ్యంగానైనా ఉంటుంది" దానివల్ల మనకూ, మనవల్ల దానికీ, లాభం వుంటుంది అన్నాడు బావ.

బావ ఈ మాట అంటుండగానే బుల్లాడు దూరంగా ఒక పిల్లిని చూశాడు. బయట గడ్డిలో ఏదోవెతుకు తున్నది పిల్లి.

"అది మనపిల్లే, బావా!" అన్నది చిట్టి.

బావా, చిట్టీ, బుల్లోడు కలసి పిల్లిని చూడటానికి బయిటికొచ్చారు. వాళ్ళు దగ్గిరకి రావడం చూచి పిల్లి నాలుగు గజాలు పారిపోయి వాళ్ళకేసి భయంతో చూస్తూ నిలబడింది.

"చూశావా. చిట్టీ. మన పిల్లి ఎట్లా అయిపోయిందో, దాని వొంటి మీద బొచ్చంతా రాలిపోయి, చిక్కిపోయి ఎట్లాఉందో !" అన్నాడు బుల్లోడు.

"ఛీ, పాడుపిల్లి మనకొద్దు!" అన్నది చిట్టి.

"మనింట్లో ఎలికెలో?" అన్నాడు బావ.

"ఎలికలయితేనటుకు దీన్నెట్లా పెంచుతాం, బావా!" అన్నదిచిట్టి.

"అట్లాకాదే, చిట్టి. దీనికి నాలుగు రోజులు తింటిపెడితే మళ్ళీ బాగా బలుస్తుంది. వొంటినిండా బొచ్చొస్తుంది. ఎలికెల్నికూడా పడుతుంది!" అన్నాడు బావ.

"నేను పట్టుకోనా?" అంటూ బుల్లాడు పిల్లిదగ్గిరికెళ్ళాడు. పిల్లి భయపడుతూ ముడుచుకుపోయి, పీలగొంతుతో, "మ్యాఁ!" అన్నది.

"ఎంత జాలిగా అరుస్తోందో!" అన్నది చిట్టి.

* * * *

పిల్లి ఇప్పుడు బాగా బలిసింది. చిట్టితోనూ బుల్లాడితోనూ చాల సరదాగా ఆడుకుంటుంది. ఇంట్లోఎక్కడా ఎలికె అలికిడిలేదు. అది ఒక్కసారి నాన్నపక్కమీదికెవెళ్ళి దర్జాగా పడుకుంటుంది. నాన్నదానికేసి అనుమానంగా చూస్తాడుగాని, ఏమీఅనడు.